క్లుప్తంగా

బాలింతలకు ప్రొటీన్ ప్యాకెట్ల పంపిణీ



ప్రొటీన్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నేతలు

కొందుర్గు: మండలంలోని రామచంద్రాపూర్, పర్వతాపూర్, సోమారంపహాడ్, చిన్న ఎల్కిచర్ల తదితర గ్రామాల్లో పాలమూరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రొటీన్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. మాతృమూర్తుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల పెద తల్లులకు నాలుగు నెలలకు సరిపడా ప్రొటీన్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్, మోహన్‌సింగ్, శ్రీశైలం, అశోక్, నర్సింలు, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో హోమాలు చేస్తున్న జంటలు

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్‌లో కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం రెండవ రోజు వేద మంత్రోశ్చరణలతో హోమాలు, పూజలు నిర్వహించారు. గణపతి పూజ, వైదిక పుణ్యాహవాచకము, పంచగవ్యప్రశన, రక్షబంధనం, దీక్షాదారణ, యాగశాల ప్రవేశం, నవగ్రహ మండపము, వాస్తుమండపం, క్షేత్రపాలక మండపము, అగ్ని ప్రతిష్ఠ, అమ్మవారి మూల మంత్రం హోమాలు, నీరాజనం, మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి పూజా కార్యక్రమాలు చేపట్టారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

- లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కొండా విజయ్‌కుమార్

షాబాద్: నిరుపేద మహిళలకు ఉచితంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని షాబాద్, కుమ్మరిగూడ, నరెడ్లగూడ గ్రామాలకు చెందిన ఐదు మంది లబ్ధిదారులకు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు కుట్టుమిషన్లు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సభ్యులు మల్లేష్, మల్లికార్జున్, షిపీ, అడ్డు, సుధీర్ తదితరులున్నారు.

ఘనంగా బండ్లప్రభ



దేవాలయం వద్ద ప్రభలను నిర్వహిస్తున్న భక్తులు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలోని మహాలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులు ఎద్దుల బండ్లతో ప్రభల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు సమీప గ్రామాలైన లేమామిడి, సుందరపురం, నిర్దవెల్లి, బోదునపల్లి నుంచి రైతులు తమ ఎద్దుల బండ్లపై ప్రభలను తీసుకువచ్చి దేవాలయం వద్ద ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో పేదలకు ప్రయోజనం

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యాదమ్మ సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లి గ్రామంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదమ్మ మాట్లాడుతూ.. కంటి పరీక్షలు నామమాత్రంగా చేయకుండా ప్రతిఒక్కరికి మందులు పంపిణీ చేయాలని సూచించారు. అవసరమైన వారందరికి కళ్లద్దాలు అందించాలన్నారు.

వారణాసి రామయ్య..
వరాలు ఇవ్వయ్యా

నేటి నుంచి వార్షికోత్సవాలు ప్రారంభం
- ముస్తాబైన కనకమామిడి దత్తాత్రేయ స్వామి ఆలయం



గర్భగుడిలో కొలువుదీరిన దత్తాత్రేయ స్వామి



ముస్తాబైన దత్తాత్రేయ దేవాలయం

మొయినాబాద్‌రూరల్: సద్గురు వారణాసి రామయ్య 81వ వార్షికోత్సవాలకు కనకమామిడి దత్తాత్రేయ స్వామి ఆలయం సర్వంగా సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు కనకమామిడి గ్రామపెద్దలు, కార్యనిర్వాహకులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు రంగారెడ్డి జిల్లాతో పాటు హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఇందుకు భక్తుల కోసం ఆలయం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

మూడు రోజుల పాటు ఉత్సవాలు..

సద్గురు వారణాసి రామయ్య వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మొదటి రోజు 23వ తేదీన ఉదయం 7 గంటలకు దీపారాధన, అభిషేకం, వారణాసి రామయ్య చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు, గణపతి హోమం, అనంతరం భక్తులకు దర్శనం, స్వామి వారి ప్రసాదంతో పాటు అన్నప్రసాదాలు నిర్వహిస్తారు. 24వ తేదీన ఉదయం 7 గంటలకు దత్తాత్రేయ స్వామి వారికి అభిషేకాలు, దత్త హోమం, అనంతరం ఆచల పరిపూర్ణ శివరామ దీక్షితుల భక్త బృందం భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 25వ తేదీన ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ, మహామంగళహారతి, భజన కార్యక్రమాలతో పాటు సద్గురు వారణాసి రామయ్య ప్రభువుల పల్లకీ సేవ గ్రామంలో ఊరేగింపు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భజన మండలిచే భజన కార్యక్రమాలను రోజంతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు మండలంలోనే మేజర్ గ్రామ పంచాయతీ అయిన కనకమామిడి గ్రామంలో జరుగుతున్న సద్గురు రామయ్య ప్రభువుల వారి దర్శనం కోసం బంధుమిత్రులు, స్నేహితులు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తులందరు సద్గురు రామయ్య ప్రభువుల వారి దర్శనం, తీర్థప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పదవ వార్డు పరిధిలోని మైహోం, రాఘవేంద్ర, ఫార్చున్ నెస్టు కాలనీల నూతన అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. కాలనీల్లో ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములైతే పట్టణంలో త్వరిగతిన మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ వాజీద్, ఉపాధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, బిలాల్, గౌస్ పాషా, చంద్రశేఖర్, సులేమాన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా అప్సర్ అలీ, సంయుక్త కార్యదర్శులుగా శివకుమార్‌గౌడ్, రవి, మహ్మద్ సాధిక్, శ్రీనివాస్‌గౌడ్, అజ్జు, కోశాధికారిగా గౌస్, ప్రచార కార్యదర్శిగా మఖ్బుల్, సత్యం, న్యాయ, విద్యా,సలహాదారులుగా శివలింగంగౌడ్, ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, ముఖ్య కూడలిలో హైమాస్టు లైట్లు, పార్కును అభివృద్ధి చేయాలని, సీఎస్‌కే నుంచి పరిగి రోడ్డు వరకు సీసీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే అభివృద్ధి సాధ్యం

కొందుర్గు: బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని బీఎస్పీ షాద్‌నగర్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బీఎస్పీ నాయకులు కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రి గ్రామంలో ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఒక్కసారి బీఎస్పీకి అవకాశం ఇస్తే బహుజనుల బతుకులు మారుతాయని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీనాయకులు శ్రీనివాసు, ఉదయ్ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యువనాయకుడు దినేష్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: అన్నిదానల్లో కెల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తనయుడు,యువ నాయకుడు పట్నం దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం అన్నారు. మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద శివరాత్రి జాతర భక్తుల కోసం చేవెళ్లకు చెందిన దాతలు మద్దెల జంగయ్య, తలారి యాదయ్యలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం వారు ప్రారంభించారు. జాతరకు వచ్చే వివిధ ప్రాంతాల ప్రజలకోసం అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావడం నిజంగా అభినందనీయమని కొనియాడారు. ప్రజల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఇలాంటి కార్యక్రమంలో ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ బండారు శైలజ, పీఏసీఎస్ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, నాయకులు రమణారెడ్డి, ఆగిరెడ్డి, యాదగిరి, మానిక్యరెడ్డి, బేగరి నర్సింలు, మానిక్యం, రాంరెడ్డి, ప్రభు,శంకరయ్య, దయాకర్ ఉన్నారు.

పురాతన రథశాలను కూల్చొద్దు

హిందూ వాహిని నేతల ఆందోళన



ఆందోళన చేస్తున్న హిందూవాహిని నాయకులు

షాద్‌నగర్: పాత జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వేంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన రథశాలను కూల్చొద్దంటూ హిందు వాహిని సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం హిందువాహిని సంఘం నాయకులు పట్టణంలోని జానంపేట వేంకటేశ్వర స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న పురాతమైన రథశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు అముడాపురం శేఖర్, చెట్ల వెంకటేష్‌లు మాట్లాడుతూ.. జానంపేటలోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సుమారు 400 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఆలయానికి సంబంధించిన రథశాలను రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు కూల్చివేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. హిందువుల సంస్కృతి, సంప్రదాయాలను, సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రథశాలను తొలగించేందుకు ప్రయత్నిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బూసరాజు, ఎమ్మె సంతోష్, శ్రీనివాస్, కమలాజీ, చట్టా మహేష్, తిరుపతిగౌడ్, మురళీధర్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

సాగు నీరు లేదు... సబ్సిడీలు రావు

బీజేపీ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: వ్యవసాయానికి సాగు నీరు , రైతులకు సబ్సిడీలు అందించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో బుధవారం సాయంత్రం ప్రజా గోస, బీజేపీ భరోసా శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీవర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో షాద్‌నగర్ పరిధిలోని నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం నేటికి ఎందుకు ప్రారంభం లేదని ప్రశ్నించారు. ప్రాణహిత చేవెళ్ల ద్వారా రంగారెడ్డి జిల్లాకు రావాల్సిన నీళ్లకు సీఎం కేసీఆర్ అడ్డుపడి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి తన పొలాలకు, ఫాంహౌస్‌కు నీళ్లు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా రైతులకు అండగా ఉంటామని చెబుతున్న సీఎం కేసీఆర్ వారికి అందించాల్సిన సబ్సిడీలన్నింటినీ ఎత్తివేశారని అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదని వాపోయారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి ప్రస్తుతం కోతలు విధిస్తున్నారన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించిందని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలందరు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, వెంకటేష్, యాదయ్య యాదవ్, కృష్ణ, రఘుగౌడ్, హరీశ్వర్, మహేష్, శ్రీను, రాజు, సురేష్, శ్యాం, గణేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం



మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మొయినాబాద్: షాబాద్ మండలంలోని హైతాబాద్‌లో వెల్‌స్పన్ కంపెనీ నూతన యూనిట్‌ను ప్రారంభించేందుకు వెళ్తున్న మంత్రి కేటీఆర్‌కు బుధవారం మొయినాబాద్‌లో ఘన స్వాగతం పలికారు. నగరం నుంచి హైతాబాద్ వెళ్తూ మార్గమధ్యలో మొయినాబాద్‌లో మంత్రి కాన్వాయ్ ఆపి బీఆర్‌ఎస్ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానం చేశారు. మంత్రితో పాటు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలు ఉన్నారు. స్వాగతం పలికినవారిలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీపీ నక్షత్రం జయవంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, నాయకులు డప్పు రాజు, మహబూబ్, పరమేష్ తదితరులు ఉన్నారు.

చేవెళ్లలో....

చేవెళ్ల: నియోజకవర్గంలోని షాబాద్ మండలంలోని చందనవెల్లి గ్రామంలోని వెల్‌స్పన్ కంపెనీలో అదనపు యూనిట్ ప్రారంభోత్సవానికి వచ్చిన కేటీఆర్‌కు చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బుధవారం చేవెళ్ల మీదుగా షాబాద్ మండలానికి వెళ్లిన కేటీఆర్‌కు చేవెళ్లలోని షాబాద్ చౌరస్తా వద్ద కాన్వాయ్‌ను ఆపి ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో చేవెళ్ల మండల బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, క్రిష్ణారెడ్డి, ప్రభాకర్, శేరి శివారెడ్డి, తోట చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నరేందర్, రాజు, తదితరులు పెద్ద ఎత్తున పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు.

ప్రతిపక్ష పార్టీ నాయకుల అరెస్టులు సిగ్గుచేటు

ముందస్తు అరెస్టులపై ఆగ్రహం



చేవెళ్ల: అరెస్ట్‌చేసిన ప్రతిపక్ష పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు



శంకర్‌పల్లి: పలు పార్టీల నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

చేవెళ్ల: రాష్ట్రంలో మంత్రులు పర్యటనలు చేయాలంటే ప్రతిపక్షపార్టీల నాయకులను అరెస్ట్‌లు చేసి పర్యటనలు చేసే పరిస్థితి రావడం సిగ్గుచేట అని ఆయా పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పోలీసులు ప్రతిపక్ష పార్టీల నాయకులను ముందస్తు అరెస్ట్‌లు చేయడంపై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలను చూసి ఈ ప్రభుత్వం భయపడుతుందన్నారు. అందుకే ఇలా పర్యటనలు చేయాల్సివస్తుందని ఆరోపించారు. వారుచేస్తున్న అభివృద్ధి పనులపై వారికే నమ్మకం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. చందనవెల్లి భూ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రైతులను నుంచి వివిధ కంపెనీలకు అప్పనంగా భూములను కట్టబెట్టి రైతులకు నష్టపరిహారం సక్రమంగా చెల్లించలేదన్నారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా మండలంలోని కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ సీపీఎం, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేసి కేటీఆర్ పర్యటన తరువాత వదిలిపెట్టారు. అరెస్ట్ చేసిన వారిలో కాంగ్రెస్‌పార్టీ నాయకు లు వసంతం, గుండాల రాములు, సుశాంత్, ఎన్కేపల్లి మహేందర్, బీజేపీ మండల ప్రధాన కార్య దర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ రామస్వామి, ప్రభులింగం, సుభాన్‌గౌడ్, మక్బుల్, సత్యనారాయణ, సత్తిరెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు రాజేశ్, ఎస్ఎఫ్ఐ అరుణ్ ఉన్నారు.

ముందస్తు అరెస్టులు

శంకర్‌పల్లి: చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండలం హైతాబాద్‌లో స్పాన్ కంపెనీ ప్రారంభోత్సవానికి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ విచ్చేయడంతో శంకర్‌పల్లిలో బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ పార్టీల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనతో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు సురేష్, కాంగ్రెస్ నాయకులు ఎజాస్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బయటకు రావాలంటే భయం

మొయినాబాద్: మంత్రి కేటీఆర్ బయటకు రావాలంటే భయపడుతున్నారని.. అందుకే ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేయిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మండిపడ్డారు. షాబాద్ మండలం హైతాబాద్‌లో కంపెనీ ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ వస్తే అర్ధరాత్రి నుంచే తమను పోలీసులు అరెస్టు చేశారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. పోలీసులు అరెస్టు చేసిన నాయకులను సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి తరువాత సొంత పూచీకత్తులపై విడుదల చేశారు. అరెస్టుయిన వారిలో బీజేపీ నాయకులు ఇన్‌చార్జి ప్రకాష్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు జ్ఞానేశ్వర్, వినయ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శికుమార్, నవీన్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, జలీల్, ప్రభాకర్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతాం

కొందుర్గు: గ్రామాల్లోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని కొందుర్గు తహసీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లోని వాగు పరివాహక ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఉంటాయని, ఈ భూములను పరిసర పొలాల పట్టాదారులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని రేగడిచిల్కమర్రి గ్రామంలో ఓ వెంచర్ నిర్వాహకులు, పక్కనే ఉన్న మరో పట్టదారు మధ్య నెలకొన్న వివాదంలో వాగు పరివాహక ప్రాంతం కబ్జాకు గురవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయమై తాను స్వయాన మోఖపైకి వెళ్లడం జరిగిందని అన్నారు. రెండు రోజుల క్రితమే ఇట్టి భూమిని సర్వే చేయించామని కొలతల ప్రకారం మరో రెండు రోజుల్లో మార్కింగ్ చేసి హద్దులు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఇలాంటి ఘటనలు మరెక్కడ జరిగినా తన దృష్టికి తేవాలన్నారు.

ప్రశ్నించే నాయకులను గెలిపించండి

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బందయ్య



ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మొయినాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే నాయకుడిని గెలిపించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బందయ్య అన్నారు. మొయినాబాద్‌లో బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఉపాధ్యాయులను కలిసి పీఆర్టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నారాయణగౌడ్, శ్రీనివాస్, రఘురాం, రవి, జైపాల్‌రెడ్డి, మజీద్, ముజీబ్, రాంచంద్రయ్య, అనసూయ, మంజుల, శ్రీలత, జనార్దన్, హసీనాబేగం, సులోచన, రాములు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తప్పనిసరి

పశువైద్యాధికారి సునీత



నట్టల మందులను వేస్తున్న పశువైద్య సిబ్బంది

నందిగామ: గొర్రెలు, మేకలకు విధిగా నట్టల నివారణ మందులను వేయించాలని కాపారులకు మండల పశువైద్యురాలు డాక్టర్ సునీత సూచించారు. మండల పరిధిలోని వీర్లపల్లిలో బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. జీవాల ఆరోగ్యం పట్ల గొర్రెకాపారులు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా అనారోగ్యాలకు గురైనట్లయితే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. గ్రామంలో 1444 గొర్రెలు, మేకలకు నట్టల మందులు వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, కాపరులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో విఫలం

బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కేసీఆర్ ప్రభుత్వం నేడు బీజేపీపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో బీజేపీ అధ్యక్షుడు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు పద్మనాభం, ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేకనే సీఎం కేసీఆర్, ఆ పార్టీ నాయకులు నరేంద్రమోడీని విమర్శిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలను సొంత పథకాలుగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఆరోపించారు. గడిచిన ఎన్నికల్లో కేసీఆర్ వాగ్దానాలు ఏవి కూడా నెరవేరలేదని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మండలానికి ఒక ఇంటర్ కళాశాల ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చిల్లి గవ్వకూడా ఇవ్వలేదని కేసీఆర్ అబద్ధపు మాటలు చెబుతున్నారన్నారు. కనకమామిడి గ్రామ పంచాయతీకి గడిచిన నాలుగు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.3.5 కోట్ల మంజూరు చేసిందన్నారు. గ్రామ పంచాయతీలో ఉన్న సీసీ రోడ్లు, వీధి లైట్లు, శ్మశానవాటికలు, మరుగుదొడ్లు, రైతు వేదికలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు కాదని కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవి అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, నాయకులు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, శ్రీరాములు, శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బంటు జ్ఞానేశ్వర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు లబ్ధి



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ పాపారావు

శంకర్‌పల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం శంకర్‌పల్లిలోని గోదాములో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటున్నారని అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కాగా, రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. ప్రభుత్వం శనగలు క్వింటాలుకు రూ. 5335కి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ మార్కెట్ మేనేజర్ మీనా, జిల్లా డీసీఎంఎస్ రాజు, మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు తదితరలు పాల్గొన్నారు.